AKSHARA TODAY
అక్షర నేటిడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## చలికాలంలోనూ ట్యాంకర్లే దిక్కు



2




## పనిమనిషి దంపతులే హంతకులు


2

## చిందాజ్‌పల్లి నుంచి తుంగెనకు డబుల్ రోడ్ వేయాలి



**అక్షరటుడే, బోధన్:** చిందాజ్‌పల్లి ఎక్స్ రోడ్ నుంచి తుంగెనకు డబుల్ రోడ్ వేయాలని తల్వేద గ్రామస్తులు కోరారు. ఈ మేరకు నగరంలోని కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి లో వినతిపత్రం అందజేశారు. చిందాజ్ పల్లి సర్పంచ్ హరిత శ్రీకాంత్ మాట్లాడుతూ.. చిందాజ్‌పల్లి ఎక్స్ రోడ్ నుంచి తుంగెన పుష్కరఘాట్ వరకు సింగిల్ రోడ్డు ఉందన్నారు. అయితే రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. రాబోయే పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే ఈ మార్గంలో డబుల్ రోడ్ వేయాలని కోరారు.







## మెరిసిపోతున్న దేవిమందిర్ రోడ్డు

శరన్నవరాత్రి ఉత్సవాలు ఇందూరులో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని దేవిమందిర్ రోడ్డును విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. ఈ రోడ్డులో ఉన్న నల్లపోచమ్మ ఆలయానికి భక్తులు తరలివస్తున్నారు. ఈ దారిలో రంగురంగుల విద్యుత్‌దీపాలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్





## శ్రీరామ్ సాగర్‌లో తగ్గుతున్న నీటిమట్టం

**అక్షరటుడే, మెండోరా:** ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతుండటంతో నీటిమట్టం పడిపోతుంది. సోమవారం ఉదయం 6 గంటల సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 1,079.70 అడుగులకు చేరగా, 44.266 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. గత 24 గంటల్లో ప్రాజెక్టుకు ఎలాంటి ఇన్‌ఫ్లో లేదని సమాచారం. మరోవైపు ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల కోసం మొత్తం 9,152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1,091 అడుగులు కాగా, పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 521 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సరస్వతి కెనాల్‌కు 670 క్యూసెక్కులు, అలీసాగర్‌కు 540 క్యూసెక్కులు, లక్ష్మి కెనాల్‌కు 285 క్యూసెక్కులు, గుత్ప ఎత్తిపోతల పథకానికి 405 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 6,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తంగా 9,152 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు నుంచి బయటకు వెళ్తోంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 1,091 అడుగులు ఉండగా, ప్రస్తుతం నీటిమట్టం గణనీయంగా తక్కువగా ఉంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం పరిస్థితులు మారే అవకాశం ఉన్న నేపథ్యంలో, ప్రాజెక్టులో అందుబాటులో ఉన్న నీటిని రైతులు సక్రమంగా, పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



## దుబాయ్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** దుబాయ్‌లో ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుబాయ్‌లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సంబరాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పాయి. ఈ వేడుకలకు తెలంగాణ నుంచి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తను ఈటీసీఏ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలకు తరలివచ్చిన తెలంగాణ మహిళలు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. విదేశీ గడ్డపై ఉంటూ కూడా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ, భావితరాలకు వాటిని పరిచయం చేస్తున్న ఈటీసీఏ ప్రతినిధులను, బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న తెలంగాణ ఆడపడుచులను బిగాల గణేశ్ గుప్త అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్,జీవన్ రెడ్డి, షకీల్, ఎన్ఆర్ఐ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాల పాల్గొన్నారు.




కామారెడ్డిని ఎడ్యుకేషన్ హబ్ చేస్తామన్న పాలకుల హామీలు ఆచరణకు నోచుకోవడం లేదు. జిల్లా కేంద్రంగా మారి పదేళ్లయినా.. అనుకున్న స్థాయిలో విద్యాసంస్థల ఏర్పాటు కాలేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నప్పటికీ.. కొత్త కాలేజీలు, విద్యా సంస్థలు ఏర్పాటు కావడం లేదు. దీంతో జిల్లా విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారు.

- అక్షరటుడే, కామారెడ్డి

## అటకెక్కిన ఎడ్యుకేషన్ హబ్

- కామారెడ్డిలో విద్యార్థులకు అందని ఉన్నత చదువులు
- అరకొరగా విద్యాసంస్థలు.. కొత్తవాటికి మోక్షమెప్పుడో..!
- కలగానే పాలిటెక్నిక్, ఉమెన్స్ కళాశాలలు

కామారెడ్డి జిల్లాలో విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. పాలకులు ఎన్నికల సమయంలో పట్టణానికి వచ్చి కామారెడ్డిని ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతామని గొప్పలు చెప్పుకోవడం తప్ప చేసిందేమీ లేదన్న టాక్ వినిపిస్తోంది. ఈ క్రమంలో పదేళ్ల కామారెడ్డి జిల్లాలో విద్యాసంస్థల ఏర్పాటును విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు, మేధావులు గుర్తు చేస్తున్నారు.

### కొత్తవాటికి మోక్షమెప్పుడో!

జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటి నుంచి ప్రతి ఎన్నికల్లో నాయకులు కామారెడ్డిని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని చెప్పడం తప్ప ఆచరణలో శూన్యమే కనిపిస్తోంది. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో ఉన్నది ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాత్రమే. అందులో కూడా ఎంబీఏ, ఎంసీఏ లాంటి పీజీ కోర్సులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఇంజినీరింగ్, ఎల్ఎల్బీ, లా, నర్సింగ్, ఐటీఐ లాంటి వృత్తి విద్యా కళాశాలలు ఇప్పటివరకు రాలేదు. దోమకొండ, గాంధారి, పిట్లం లాంటి పెద్ద మండల కేంద్రాల్లో డిగ్రీ కళాశాలలు కూడా ఏర్పాటు కాకపోవడంతో విద్యార్థులు ఉన్నత విద్య కోసం నిజామాబాద్, హైదరాబాద్ వైపు చూడాల్సి వస్తోంది.

### ఉమెన్స్ కళాశాల కలేనా..?

జిల్లాకు పాలిటెక్నిక్ కళాశాల మంజూరవుతుందని భావిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు కామారెడ్డికి మొండిచేయి చూపుతూనే ఉన్నాయి. జిల్లాకు మంజూరైన పాలిటెక్నిక్‌ను నస్రుల్లాబాద్‌కు తరలించడంతో కామారెడ్డి విద్యార్థులు నిరాశకు గురయ్యారు. అదేవిధంగా మహిళా డిగ్రీ కళాశాల సైతం మంజూరుకు నోచుకోవడం లేదు, సొంత భవనం లేక బాలికల విద్య మరింత వెనుకబడుతోంది. ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాలు నేటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతుండటం పరిస్థితికి అద్దం పడుతోంది.

### జిల్లా కేంద్రాన్ని దాటుతున్న విద్యాసంస్థలు

మంజూరైన సంస్థలు కామారెడ్డి దాటి వెళ్తున్నాయనే ఆవేదన విద్యార్థి లోకంలో వ్యక్తమవుతోంది. కామారెడ్డికి రావాల్సిన తెలంగాణ యూనివర్సిటీ పాలకుల నిర్లక్ష్యంతో డిచ్‌పల్లికి వెళ్లిందని విద్యార్థి సంఘాలు ఇప్పటికీ ఆరోపిస్తున్నాయి. ప్రస్తుతం భిక్కనూర్‌లోని సౌత్ క్యాంపస్‌ను మెయిన్ క్యాంపస్‌గా మార్చి, కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను దాని సౌత్ క్యాంపస్‌గా మార్చాలన్న డిమాండ్ విద్యార్థి సంఘాల నుంచి వ్యక్తమవుతున్నప్పటికీ ఆ దిశగా అడుగులు పడటం లేదు.

### పట్టించుకోని అధికారులు..

పదేళ్ల కామారెడ్డి జిల్లా అభివృద్ధిలో విద్యారంగం అట్టడుగున ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిజానికి కామారెడ్డిలో భూమికి కొరత లేదు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల పేరిట 148 ఎకరాల ప్రభుత్వ స్థలం రిజిస్ట్రేషన్ అయింది. ఇందులో ప్రభుత్వ భవనాలు, ప్రైవేట్ సంస్థలకు కేటాయించిన స్థలం పోగా ఇంకా 50 నుంచి 60 ఎకరాలు ఖాళీగా అందుబాటులో ఉన్నట్లు సమాచారం. అందుబాటులో భూములున్నా, డిమాండ్ ఉన్నా కొత్త కళాశాలల కోసం ప్రతిపాదనలు పంపడంలో అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. పట్టణంలో ఇంజనీరింగ్, ఎల్ఎల్బీ, నర్సింగ్, మహిళా డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### విద్యాభివృద్ధి హామీలను అమలు చేయాలి



కామారెడ్డి ప్రజలకు సీఎం ఇచ్చిన విద్యా అభివృద్ధి హామీలను అమలు చేయాలి. కామారెడ్డి, కొడంగల్ రెండు కళ్లులాంటివని సీఎం స్వయంగా చెప్పారు. అలాంటప్పుడు కామారెడ్డి జిల్లా కేంద్రాన్ని విద్యా హబ్‌గా అభివృద్ధి చేసి, కొత్త డిగ్రీ, పీజీ, కోర్సులు,టెక్నికల్, ప్రొఫెషనల్ విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలి. విద్యార్థి సేన తరఫున కామారెడ్డికి ప్రత్యేక ఎడ్యుకేషన్ హబ్ కార్యాచరణ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

– వినయ్, విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు

### కామారెడ్డిని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాలి



కామారెడ్డి జిల్లాను ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేయాలి. గత సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినా, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోనూ విద్యాసంస్థలు ఏర్పాటు కాలేదు. విద్యాసంస్థలు లేక విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. సౌత్ క్యాంపస్‌ను పూర్తిస్థాయి యూనివర్సిటీగా అభివృద్ధి చేయాలి. డిగ్రీ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు, ఇంజనీరింగ్, లా, పాలిటెక్నిక్, నర్సింగ్, మహిళా డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి. బీసీ, ఎస్సీ, మహిళా వసతి గృహాలు నిర్మించాలి.

– జీవీఎం విఠల్, ఏఐఎస్ఏ జిల్లా కన్వీనర్



## ఢిల్లీలో నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో లోపాలున్నాయంటూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనల్లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పాల్గొన్నారు. గాంధీ విగ్రహం వద్ద తెలంగాణ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఓటర్ల సవరణ ప్రక్రియలో తలెత్తిన అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వాలని, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా చర్యలు తీసుకోవాలని ఇండియా కూటమి నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కూడా వారు కోరారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఇండియా కూటమికి మద్దతు తెలిపారు.



## కలెక్టరేట్‌లో ప్రజావాణికి 89 ఫిర్యాదులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి తో సహా అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 89 ఫిర్యాదులు స్వీకరించామని కలెక్టర్ తెలిపారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ రాజా గౌడ్, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్వో గీత, జిల్లా పరిషత్ సీఈవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో 750 బెడ్లకు బడ్జెట్ పెంచాలి

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని జీజీహెచ్‌లో 750 బెడ్లకు సంబంధించి బడ్జెట్‌ను పెంచాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీజీహెచ్ ఎదుట తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి.. సూపరింటెండెంట్ డాక్టర్ రాములుకు వినతిపత్రం అందజేశారు. రోజువారీ ఓపీ 2500, ఐపీ 200 దాటుతుండటంతో పాటు ఎంసీహెచ్ భవనంలో పనిచేస్తున్న సిబ్బందిపై తీవ్ర పనిభారం పడుతోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య, జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జీజీహెచ్‌ను 750 పడకల ఆస్పత్రిగా గుర్తించి బడ్జెట్ పెంచాలని, వేతనాల టెండర్ ముగిసినందున కార్పొరేషన్ ఏర్పాటు చేసి పారితోషికాలు చెల్లించడంతో పాటు పండగ, ఆర్జిత సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.భాగ్యలక్ష్మి, స్వరూప, భారతి, కవిత, సాయి, సునీత, సఫియా తదితరులు పాల్గొన్నారు.




## నందిగుట్టను అక్రమ మైనింగ్ నుంచి కాపాడాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ముదక్‌పల్లి గ్రామంలోని నందిగుట్టను అక్రమ మైనింగ్ నుంచి కాపాడాలని బీజేపీ ఓబీసీ మోర్చా కోశాధికారి బోడ మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. నందిగుట్ట ప్రముఖమైన పుణ్యక్షేత్రంగా విలసిల్లుతోందన్నారు. ఈ గుట్టపై అయ్యప్ప స్వామి ఆలయం నిర్మాణం కోసం బేస్మెంట్, నాలుగు పిల్లర్లు వేసి నిర్మాణం కొనసాగిస్తున్నారన్నారు. అలాగే శివాలయం కూడా ఉందన్నారు. గుట్టకు ఆనుకొని సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, గణపతి ఆలయం కూడా ఉన్నాయన్నారు. అయితే కొంతమంది నాయకులు నందిగుట్ట పక్కన ఉన్న అసైన్డ్‌మెంట్ భూమిని లీజుకు తీసుకొని మైనింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆ సర్వే నంబర్‌లో భూమిలో మైనింగ్ చేయడానికి మొరం లేదు. కానీ



పక్కనే ఉన్న నందిగుట్ట మొరం తీద్దామని ప్రణాళిక వేస్తున్నారన్నారు. దీనికి మండల అధికారులు సహకరిస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. నందిగుట్టపై ఆలయాలు ఉన్న నేపథ్యంలో అక్కడ మైనింగ్ నిర్వహించడం వల్ల గుట్టకు, ఆలయాలకు మరియు పరిసర పర్యావరణానికి నష్టం కలిగే అవకాశం ఉందన్నారు.

అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND

2

నిజామాబాద్/కామారెడ్డి
సోమవారం
12.10.2026

www.aksharatoday.in
AKSHARA TODAY

## మద్యపాన నిషేధానికి నడుం బిగించిన గ్రామస్తులు



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని పోల్కంపేట గ్రామంలో మద్యపానాన్ని పూర్తిగా నిషేధించాలని గ్రామస్తులు సోమవారం తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ.. గ్రామంలో పూర్తిగా మద్యపానాన్ని నిషేధించాలని యువత, మహిళలు, ఆయా సంఘాల కుల నాయకులు, గ్రామ పెద్దలు ముందుకు రావడం చాలా అభినందనీయమన్నారు. గ్రామంలో మద్యం విక్రయిస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు. అలాగే సమాచారం అందించిన వారికి రూ.10వేల నజరానా అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఆయా కుల సంఘాల నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ‘బతుకమ్మ’ సంస్కృతిని కాపాడుకుందాం : సంస్కార భారతి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** తెలంగాణలో ‘బతుకమ్మ’ సంస్కృతిని కాపాడుకుందామని సంస్కార భారతి అధ్యక్షుడు రాజ్ కుమార్ సుబేదార్ పేర్కొన్నారు. నగరంలోని సీతారాంనగర్ కాలనీ హనుమాన్ ఆలయంలో సంస్కారభారతి ఆధ్వర్యంలో సామూహిక బతుకమ్మ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. బతుకమ్మలపై మంచి పాటలు పాడిన వారికి బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మాధురి, మాతృ శక్తి కన్వీనర్ వరలక్ష్మి, మాధవి, నగర కన్వీనర్ నగుర్తి శంకర్, కె.వి రమణాచారి, కోశాధికారి రాధాకృష్ణ, నాగ్‌నాథ్, సాయా రెడ్డి, శ్రీకాంత్, మధు, జాగృతి ప్రతినిధులు

## పనులు చేస్తామని చెప్పాను కదా.. మళ్లీ ఈ డ్రామాలేంది : మున్సిపల్ కమిషనర్ అసహనం



**అక్షరటుడే, కామారెడ్డి :** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళనకు దిగిన డబుల్ బెడ్‌రూమ్ కాలనీవాసులపై కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ పర్వతాలు అసహనం వ్యక్తం చేశారు. ‘మీ పనులు చేస్తామని చెప్పాను కదా.. మళ్లీ ఈ డ్రామాలేంది’ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజీవ్ నగర్ కాలనీలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద రోడ్డు, డ్రెయినేజీ కోసం ప్రభుత్వ షబ్బీర్ అలీ రూ.2 కోట్లు మంజూరు చేశారు. నిధులు మంజూరై 8 నెలలు కావస్తున్నా పనులు ప్రారంభం కావడం లేదని కాలనీవాసులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖైఠాయించారు. టెండర్ క్యాన్సిల్ కావడంతో పనులు ఆలస్యమయ్యాయని కమిషనర్ తెలిపారు. షబ్బీర్ అలీకి ఫోన్ చేసి వారితో మాట్లాడించారు. సంబంధిత పత్రాలు చూపిస్తానని తన ఛాంబర్‌కు రావాలని సూచించారు. దీంతో కొంతమంది ఛాంబర్‌కు వెళ్లగా, ‘అక్కడే మాట్లాడాను కదా.. మళ్లీ ఎందుకొచ్చారు’ అని అనడంతో వాగ్వాదం జరిగింది. కార్యాలయం బయటకు వచ్చిన కమిషనర్‌ను మరోసారి నిలదీయడంతో సహనం కోల్పోయారు. నాకేం పనులు లేవనుకుంటున్నారా.. మీ కోసమే ఉంటానా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సాధారణంగా ఎండాకాలంలో తీవ్రంగా ఉండే తాగునీటి ఎద్దడి, ఇప్పుడు చలికాలంలోనూ ప్రజలను పట్టిపీడిస్తోంది. గాంధారి మండల కేంద్రంతో పాటు మండలంలోని 45 గ్రామపంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. పలుచోట్ల వాటర్‌ట్యాంకర్లతో నీటిసరఫరా జరుగుతున్నప్పటికీ ఆ సమయంలో యుద్ధాలే జరుగుతున్నాయి.
– అక్షరటుడే, గాంధారి



# చలికాలంలోనూ వాటర్ ట్యాంకర్లే దిక్కు

■ గాంధారి మండలంలో తాగునీటికి అల్లాడుతున్న ప్రజలు ■ సరఫరా కానీ మిషన్ భగీరథ నీళ్లు

గాంధారి మండల పరిధిలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లు ఇంటింటికీ సక్రమంగా సరఫరా కాకపోవడం, కొన్నిచోట్ల బోరు మోటార్లు పనిచేయకపోవడంతో ప్రజలు నీటికోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. కిలోమీటర్ల కొద్దీ నడిచి నెత్తిపై బిందెలతో, మరికొందరు ద్విచక్ర వాహనాలపై డబ్బాలు కట్టుకుని సుదూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు.

### మండలంలో ఆరు గ్రామాల్లో..

మండలంలో సుమారు ఆరు గ్రామాల్లో నీటి ఎద్దడి ఉంది. గాంధారి, మాదాపల్లి, తిప్పారం తండా, హేమ్లా నాయక్ తండా, బుర్గుల్ గ్రామాల్లో నీటిఎద్దడి ఉంది. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలకు కొన్ని పంచాయతీల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అధికారులు ముందుచూపుతో వ్యవహరించి ముందస్తు చర్యలు చేపట్టి ఉంటే చలికాలంలో ఈ తిప్పలు తప్పేవని గ్రామస్తులు వాపోతున్నారు.





### సమస్యను పరిష్కరిస్తాం..

మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న తాగునీటి సమస్యపై సెక్రెటరీలు పలువురు నా దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే ఒక సమావేశం నిర్వహించాం. వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తాం. సమస్యను త్వరలోనే పరిష్కరించేందుకు కృషిచేస్తాం. – రాజేశ్వర్, ఎంపీడీవో, గాంధారి

## ‘గాయత్రిదేవి’గా అమ్మవారి దర్శనం



**శరన్నవరాత్రి ఉత్సవాలు ఉమ్మడిజిల్లాలో భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. సోమవారం అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండపాల్లో కొలువైన అమ్మవారిని భక్తులు దూపదీప నైవేద్యాలతో కొలుస్తున్నారు.**
– అక్షరటుడే, నెట్‌వర్క్



సీతారాంనగర్ కాలనీలోని బంగారు మైసమ్మ ఆలయం సమీపంలో..



నగరంలోని కంఠేశ్వర్ ఆలయంలో దుర్గామాతకు పూజలు..



నగరంలోని కోటగల్లీలో కోట మైసమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో..



నగరంలోని దేవిరోడ్‌లో నల్లపోచమ్మ ఆలయంలో భక్తుల సందడి..

## రామచంద్రపల్లిలో ర్యాంప్‌లను తొలగించిన అధికారులు



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలంలోని రాంచంద్రపల్లిలో గ్రామ అభివృద్ధిలో భాగంగా రోడ్డు వెడల్పు పనులను చేపడుతున్నట్లు సర్పంచ్ తొగర్ల భూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా భూషణ్ మాట్లాడుతూ.. రహదారులపై, డ్రైనేజీ కాలువలపై నిర్మించిన గోడలు, ఇతర నిర్మాణాలను తొలగించి, నూతన డ్రైనేజీ కాలువల పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామ ప్రజలు రోడ్డు వెడల్పు పనులకు సహకరించాలని సర్పంచ్, గ్రామపంచాయతీ పాలకవర్గం విజ్ఞప్తి చేశారు. గ్రామంలో రహదారులు విస్తరించి, నూతన డ్రైనేజీ కాలువలు నిర్మితమైతే రాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

## 13న వినాయక సిద్ధి, బుద్ధి కల్యాణ మహోత్సవం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలో శ్రీరామ్ సేన యూత్, దుర్గాభవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 13న ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ఉదయం 9:15 గంటలకు వినాయక సిద్ధి, బుద్ధి కల్యాణం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 1:15కు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మాలాధారణ స్వాములు, అమ్మవారి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కమిటీ సభ్యులు కోరారు. అధికారులు ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక ఆహ్వానం అందజేస్తున్నామని శ్రీ రామ్ సేన యూత్ దుర్గా భవాని ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే మదన్‌మోహన్ చిత్రపటానికి పాలాభిషేకం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని వెల్లుట్ల గ్రామంలో నూతనంగా మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమిపూజ నిర్వహించారు. ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆయా గ్రామాల సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. ఎన్నడూ లేని విధంగా ఎల్లారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. నియోజకవర్గంలో 8 విద్యుత్ సబ్‌స్టేషన్ల మంజూరుకు కృషి చేయడం ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు.

## సెల్‌ఫోన్ కోసం స్నేహితుడిని బండరాయితో కొట్టి హత్య

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** సెల్‌ఫోన్ గొడవ ఒకరి ప్రాణం తీసింది.. ఈ ఘటన నగరంలోని మూడో టౌన్ పరిధిలో చోటు చేసుకుంది. నగరంలోని మూడో టౌన్ పరిధిలో న్యూ ఎన్జీవోస్ కాలనీ ప్రాంతంలో నివాసముండే గంగోని వినోద్, జయంత్ స్నేహితులు. ఈనెల 8వ తేదీన తెల్లవారుజామున మద్యం మత్తులో ఉండగా సెల్‌ఫోన్ విషయంలో గొడవపడ్డారు. ఈ క్రమంలో జయంత్ బండరాయితో వినోద్ తలపై కొట్టడంతో అతడికి తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే అతడిని జీజీహెచ్‌కు తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ అక్కడ చికిత్స పొందుతూ 11వ తేదీ ఆదివారం మృతి చెందాడు. మూడో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పనిమనిషి దంపతులే హంతకులు.. వీడిన వృద్ధురాలి హత్య మిస్టరీ




**అక్షరటుడే, కామారెడ్డి:** ఇంట్లో పనిమనిషిగా ఉంటానని వచ్చిన ఓ మహిళ వృద్ధురాలిని దారుణంగా హత్య చేసింది. ఈ ఘటనలో పనిమనిషి దంపతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ రాజేష్‌చంద్ర వివరాలు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 29 న కోటారి గల్లీలో అనసూయ అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె మెడపై గాయంతో పాటు బంగారు ఆభరణాలు కనిపించకపోయేసరికి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి విచారణ ప్రారంభించగా ఇంట్లో పనిచేసే పనిమనిషితో పాటు మరికొందరిని విచారించారు. చివరికి పనిమనిషి రజితపై అనుమానం రావడంతో ఆమె కదలికలపై నిఘా వేసిన పోలీసులు భర్తతో కలిసి రజితనే ఈ హత్యకు కారణమని తేల్చారు. ప్రతిరోజు సాయంత్రం వృద్ధురాలి భర్త గుడికి వెళ్లడం అలవాటు కాగా 29న సైతం సాయంత్రం ఆయన గుడికి వెళ్లాడు. అదే సమయంలో భర్త నర్సింగ్‌తో కలిసి వృద్ధురాలిని వెనకనుంచి టవల్‌ను మెడకు బిగించి హత్యచేసి ఆభరణాలు దోచుకున్నారు. వృద్ధురాలు గుర్తు పడుతుందని హత్య చేసి బంగారంతో ఉడాయించి తమపై అనుమానం రాకుండా ఎప్పటిలాగే పనికి వచ్చారు. పెద్దమొత్తంలో డబ్బు సంపాదించాలనే ఆశతో బంగారాన్ని దొంగిలించాలని పథకం వేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. 2023లో కూడా ఇదే జంట కామారెడ్డిలో ఓ ఇంట్లో పని చేస్తుండగా ఇదే తరహాలో చోరీకి పాల్పడగా ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో వీరిని అరెస్ట్ చేయలేదని ఎస్పీ తెలిపారు. ప్రస్తుతం ఆ కేసు కూడా రీ ఓపెన్ చేస్తామని పేర్కొన్నారు.

## ఆలూర్ వీడీసీ కార్యవర్గం ఎన్నిక



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండల కేంద్రంలో సోమవారం విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (వీడీసీ)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ కల్లెం మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా పెండ ఉదయ్, పుట్ట కిరణ్, కుస్తాపురం కిషన్, క్యాషియర్లుగా మిద్దెల రాజు, దుగ్గి లక్ష్మణ్, చిలుక శ్రీను, కార్యదర్శులుగా సుభాష్, ప్రదీప్, అనంతం, సుమన్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా ఏలేటి గంగారెడ్డి, దుమాజి శ్రీనివాస్, మర్కంటి గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు కల్లెం మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో వీడీసీ అధ్యక్షుడిగా ఎన్నుకున్న గ్రామ పెద్దలకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వైశ్య భవన్‌లో భక్తిశ్రద్ధలతో దేవి నవరాత్రి ఉత్సవాలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని వైశ్య భవన్‌లో దేవి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా చిన్నారులు అమ్మవారి తొమ్మిది రూపాలను ప్రతిబింబించేలా వివిధ వేషధారణలతో అలరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒక్కో రూపం వెనుక ఉన్న ఆధ్యాత్మిక విశిష్టత, ఆ రూపం అవతరించిన సందర్భం, భక్తులకు అందించే సందేశాన్ని వివరిస్తూ చిన్నారులు అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో భక్తిభావంతో పాటు హిందూ సంప్రదాయాలు, సంస్కృతిపై అవగాహన పెరుగుతుందన్నారు. వైశ్య భవన్‌లో వాసవీ మాతకు దుర్గామాత అలంకరణలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వైశ్య సంఘం అధ్యక్షుడు సిద్ది శ్రీధర్ గుప్తాతో పాటు వైశ్య సంఘం ప్రతినిధులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.